
క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటాం



బాపట్ల: బాపట్ల పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు చేస్తున్న షాపులపై మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ ఆకస్మిక తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని పలు షాపులపై దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయాలు చేసిన వారిపై చర్యలు తీసుకున్నారు. అపరాధ రుసుం విధించారు. ప్రజలు ఎవరు కూడా ప్లాస్టిక్ కవర్లు వినియోగం చేయవద్దని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆమె కోరారు.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం



నగరం: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా జరిగిన కల్యాణ మహోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో డాక్టర్ గణేష్ టీం ప్రతిభ



రేపల్లె: రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలం శ్రీకాకుళంలో గత 20 రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని టీమ్ ప్రతిభ చాటి టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఈవూరు గణేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

ఆంజనేయస్వామికి అరటి పూల పూజ



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారికి అరటి పుష్పాలతో విశేషంగా పూజ నిర్వహించారు. మన్నె శివ వెంకటేశ్వరరావు దంపతులు సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం జరిపించి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి అష్టోత్తర సహస్ర నామాలతో అరటి పుష్పాల మాలలను అలంకరించి పుష్పాలతో విశేషంగా పూజ జరిపారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. భజన సంఘాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచం గుర్తించిన కమ్యూనిస్టు సుందరయ్య

వర్ధంతి సభలో సీపీఎం నేత కేబీ ప్రసాద్

తెనాలి: సీపీఎం తెనాలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం, అగ్రనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడు ఎస్.సుబ్రహ్మణ్యం సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీ నాయకుడు కేబీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచం గుర్తించిన అతికొద్దిమంది కమ్యూనిస్ట్ నాయకుల్లో సుందరయ్య ఒకరని గుర్తుచేశారు. పార్టీ నాయకులు షేక్ హుస్సేన్ వలి, జె.శ్యామ్, ములకా శివసాంబిరెడ్డి, జి.రవీంద్ర, వై.అశోక్‌కుమార్ మాట్లాడారు. శెట్టి ఏసోబు, కె.దుర్గాప్రసాద్, కుర్రా వెంకటరమణ, సంగమేశ్వరరావు, దార్ల పద్మ, కస్తూరి, మరియమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అక్రమ సంపాదనకు అడ్డా చుండూరు

- చుండూరు మండలంలో మెరక పేరుతో మట్టి అమ్మకాలు
- జోరుగా సాగుతున్న పేకాట, కోడి పందేలు
- అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం
- పట్టించుకోని పోలీసులు, అధికారులు



పెదగాదెలవర్రు గ్రామంలో చెరువులో మట్టి తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

వేమూరు: కూటమి నాయకుల అక్రమ సంపాదనకు చుండూరు అడ్డాగా మారింది. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలో కూటమి నాయకులు అక్రమంగా సంపాదిస్తున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని నెలలు నుంచి చుండూరు మండలంలో పేకట, కోడి పందేలు, రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం రావడంతో కూటమి నాయకులు అక్రమ సంపాదన కోసం చెరువులపై కన్ను వేశారు. జగనన్న కాలనీలలో మెరకు చేయాలని అధికారులకు చెప్పి మట్టి అమ్ముకుంటున్నారు. చుండూరు మండలంలోని పెదగాదెలవర్రు గ్రామానికి చెందిన కూటమి నాయకులు పెదగాదెలవర్రు, చుండూరు, అంబేడ్కర్ నగర్, నడిగడ్డవారిపాలెం, కారుమూరివారిపాలెం, చినగాదెలవర్రు, చినపరిమి గ్రామాల్లో జగనన్న కాలనీలకు మెరకలు వేయాలని అనుమతి తీసుకొని చెరువుల్లో మట్టిని ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జగనన్న కాలనీలకు మెరక పేరుతో మట్టిని అక్రమంగా మండలంలోని ఇతర గ్రామాలకు అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు కనీసం కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు అంటున్నారు.



నిమ్మ తోటలో పేకాట ఆడుతున్న దృశ్యం

నిమ్మ తోటల్లో పేకట

కూటమి నాయకులు పోలీసులకు తెలియకుండా నిమ్మ తోటల్లో పేకట నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని నెలల నుంచి ఈ వ్యవహారం సాగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు డ్రోన్లు ఉపయోగించినా నిమ్మ తోటల్లో పేకాట ఆడుతున్న జూదరులు దొరకడం లేదు. కొన్ని రోజులు పేకాట నిలిపి వేసి మరలా జోరుగా సాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ పేకాట వల్ల కొన్ని కుటుంబాలు అప్పుల పాలై దెబ్బతింటున్నాయి.

ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యం తరలింపు

మండల కేంద్రంలోని నడిగడ్డవారిపాలెం వద్ద రేషన్ మిల్లు ద్వారా రేషన్ బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని రేషన్ బియ్యం చుండూరు మండల కేంద్రంలోని రేషన్ మిల్లు ద్వారా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మట్టి అమ్ముకుంటున్నారు



చెరువుల్లో మట్టి అక్రమంగా తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు అక్రమ మట్టి తరలింపును నిలిపివేయాలి. జగనన్న కాలనీలకు మెరక చేయకుండా మట్టిని అమ్ముకుంటున్నారు. – కుడితిపూడి వేణుబాబు, పెదగాదెవర్రు, చుండూరు మండలం

పేకాటలు నిలిపి వేయాలి



కూటమి ప్రభుత్వం ఆడిస్తున్న పేకాట వల్ల కొన్ని కుటుంబాలు దెబ్బతింటున్నాయి. పోలీసులు, పేకాట నిర్మూలన చేసేందుకు చర్యలు తీసుకోవాలి. – తమ్మా బసివి రెడ్డి, చినపరిమి, చుండూరు మండలం

కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తుంది

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి గణేష్ పాల్గొన్న చేనేత నాయకులు

చెరుకుపల్లి: చేనేత రంగాన్ని కూటమి ప్రభుత్వం రోజురోజుకు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సోమవారం గుళ్ళపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం పిలుపు మేరకు చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నియోజకవర్గ చేనేత నాయకులతో విలేకర్ల సమావేశం డాక్టర్ గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తరువాత ప్రధానమైనది చేనేత వృత్తి అని అటువంటి చేనేత వృత్తి ఆదరణ కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేకపోయారని ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ప్రతి చేనేతకు విద్యుత్ 200 యూనిట్ల వరకు ఉచితం అని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. అదే విధంగా జీఎస్‌టీ గురించి ఇచ్చిన హామీ అమలు చేయాలని, ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాల ఎన్నికలు జరిపించాలని, గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం తదితర పథకాలను అమలు చేసి ఆదరణ కోల్పోతున్న చేనేత రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే చేనేత సమస్యలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా అవి పరిష్కారం అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని డాక్టర్ గణేష్ అన్నారు. చేనేతల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేనేతలను కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఆదుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత రంగాన్ని, కార్మికులను ఆదుకోవాలని లేని పక్షంలో చేనేతల పక్షాన ఆందోళన చేస్తామని గణేష్ హెచ్చరించారు. అనంతరం చేనేత నాయకులు నూలు దండ దుశ్శాలువాతో డాక్టర్ ఈవూరి గణేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వంగరు భాను, రేపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు కందుల సురేష్‌బాబు, కనగాల చేనేత సహకార సంఘ అధ్యక్షుడు సంగాబత్తిన సూర్యనారాయణ, చేనేత నాయకులు కన్నెర్ల రామకృష్ణ, వంగర వెంకటేశ్వరరావు, పట్టెం లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

తెనాలిఅర్బన్: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరిగింది. మొదటిరోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటలనుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాలను అనుమతించారు. తెనాలిలో ఎన్‌సీఆర్ ఎస్‌ఎంహెచ్ స్కూల్, కెఎస్‌ఎంహెచ్ స్కూల్, బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఏఎస్ఏస్ఎం స్కూల్‌లను పరీక్ష కేంద్రాలుగా అధికారులు ప్రకటించారు. మొదటి రోజు ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ తెలిపారు.

జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలి

తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ తెనాలి పట్టణ అధ్యక్షుడు షేక్ జానీబాషా డిమాండ్ చేశారు. సోమవారం తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 523 వలన ఉద్యోగులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్యదర్శి కె.ధర్మసాయి, అజయ్, భాస్కర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి మహోత్సవాలు జయప్రదం చేయాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి



వీరాంజనేయుడికి జంభీర ఫలార్చన



హనుమాన్ చాలీసా పారాయణ

తెనాలిటౌన్: స్థానిక షరాఫ్‌బజార్‌లో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుండి జూన్ 1వ తేదీ వరకు జరిగే వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం దేవాలయం వద్ద కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 30వ తేదీన శ్రీ సీతారామకళ్యాణం, 31వ తేదీన హనుమత్ కల్యాణం జరుగుతాయని తెలిపారు. 1వతేదీ పూర్ణాహుతి ఉత్సవాలతో ముగిస్తామని వివరించారు. అర్చకులు ఆర్‌వీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 21తేదీ ఉదయం పట్టణ పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్రలో పాల్గొన భక్తులందరికీ స్వామివారి పతకాన్ని ఇవనున్నట్లు చెప్పారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం నేతృత్వంలో ప్రతిరోజు జరిగే హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఉన్నారు.

మారీసుపేటలో...

తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో గల వీరాంజనేయస్వామికి ఈనెల 22వ తేదీన హనుమజ్జయంతిని పురస్కరించుకుని లక్ష ప్రదక్షిణముల మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి ఆరంభమైన కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతున్నారు. భక్తులు తమ శక్తిని అనుసరించి ప్రదక్షిణములు చేస్తున్నారు. అలాగే హనుమాన్ చాలీసా పారాయణంలోనూ సామూహికంగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో సోమవారం స్వామివారికి జంభీర (నిమ్మకాయలు) ఫలార్చన చేశారు. తదుపరి హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. లలితా గోష్టిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 20న సామూహిక సిందూరార్చన, 22న హనుమజ్జంతి వేడుకను నిర్వహిస్తారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగ సూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేష గిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే శిక్షార్హులే



తెనాలి: ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం ఈనెల 20న జరగనున్న సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఆంధ్రప్రదేశ్ కంట్రోలర్ సౌరభ్‌గౌర్ ఆదేశాలపై 8వ తేదీనుంచి వర్తక సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏపీఎస్‌ఆర్టీసీ తెనాలి బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వ్యాపారస్తులు, వినియోగదారులకు ప్యాకేజీ కమాడిటిస్ లీగల్ మెట్రాలజీ శాఖ రూల్స్–2011 గురించి తెనాలి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి.శేషసాయి అవగాహన కల్పించారు. తినుబండారాలు, కూల్‌డ్రింకులు ఎమ్మార్పీ ధరలకన్నా ఎక్కువ అమ్మితే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ సిబ్బంది, ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన

తెనాలిరూరల్: తనను పెళ్లి చేసుకోవాలంటూ యువతితో యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన యువకుడు బషీర్ ఆదివారం సాయంత్రం అదే కాలనీకి చెందిన యువతి ఇంటికి వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలంటూ అసభ్యంగా ప్రవర్తించాడు. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అతనిపై త్రీటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోండి

తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని విశ్రాంత గ్రంథాలయాధికారి మువ్వా సుబ్బారావు పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదివే అలవాటును పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ఖాళీ సమయంలో గ్రంథాలయాన్ని సందర్శించే అలవాటును చేసుకోవాలన్నారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఎస్.లావణ్య సుధ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులందరూ దీనిలో పాల్గొన్నారు. అనంతరం మువ్వా సుబ్బారావు, అహ్మద్ హుస్సేన్, బొల్లిముంత కృష్ణ మాస్టార్‌లు యోగా, ధ్యానం, పాటలు వంటి వాటిని నేర్పించారు. చెస్, క్యారమ్స్, సూడో, స్కిపింగ్ వంటి వాటిని విద్యార్థులతో ఆడించారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె : సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ ఎడ్లపల్లి గ్రామానికి చెందిన లింగినేని కృష్ణమూర్తి, రేపల్లె మండలం సింగుపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ రుక్మిణమ్మ, యార్లగడ్డ చంద్రశేఖరరావు, యార్లగడ్డ మదన్ మోహనరావులు అర్జీలు ఇచ్చారన్నారు. తన భూమికి రీ సర్వే చేసిన సర్టిఫికెట్‌ను అందించాలని భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన బస్సు గోవిందు అర్జీ ఇచ్చారన్నారు. పెనుమూడిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని అదే గ్రామానికి చెందిన అవనిగడ్డ గంగాధర్ అర్జీ ఇచ్చాడన్నారు. తమ సొంత భూమి వివరాలు దేవదాయ ధర్మదాయ శాఖ భూములలో నమోదయ్యాయని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని 14వ వార్డుకు చెందిన పిల్లి రాజేంద్రప్రసాద్, వెంకటకృష్ణలు అర్జీ ఇచ్చారన్నారు. రీ సర్వేలో తమకున్న ఎకరం 10 సెంట్ల భూమిలో మూడున్నర సెంట్లు తగ్గిందని సమస్యను పరిశీలించి రీ సర్వే చేసి తమ మూడున్నర సెంట్ల భూమిని తమ పొలంలో కలపాలని కొల్లూరు మండలం పోతార్లంక గ్రామానికి చెందిన నాదెండ్ల అరుణ కుమారి అర్జీ చేసిందన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

హిందువులందరూ ఐక్యంగా ఉండాలి

శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



మాట్లాడుతున్న శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి

నిజాంపట్నం: హిందువులందరూ దైవ భక్తితో పాటు దేశభక్తి కలిగి ఐక్యంగా ఉండాలని శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి చెప్పారు. హిందూ చైతన్య వేదిక, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సహకారంతో ఆదివారం రాత్రి గరువుపాలెంలో జరిగిన హనుమాన్ శోభ యాత్ర బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందువులందరూ ఐక్యంగా ఒక తాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. హనుమంతుని స్ఫూర్తితో శత్రుదేశాల దుష్టపన్నాగాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దైవ సేవకు కొంత సమయం కేటాయించి ఆధ్యాత్మిక చింతన పొందాలని కోరారు. ఈ సందర్భంగా గరువుపాలెం నుంచి నగరం హనుమాన్ ఆలయం వరకు జరిగిన హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ప్రతినిధి అంబటి మారుతీ రామ్, అవ్వరు శ్రీనివాసరావు, బాపట్ల ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త వరికుటి శివ గోపి, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు నరసింహం, జంజనం హేమశంకరరావు, వక్కలగడ్డ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'కు దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీవో నాగలక్ష్మి



నిజాంపట్నం: సోలార్ విద్యుత్‌ను గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంపీడీవో నాగలక్ష్మి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా చేసే సోలార్ ప్యానల్స్‌ను పెట్టుకునేందుకు సబ్సిడీ అందిస్తుందన్నారు. యూనిట్ కాస్ట్ రూ.2,10,000 కాగా లబ్ధిదారుడు రూ.20,000 చెల్లిస్తే రూ.78,000 సబ్సిడీ, రూ.1,12,000 బ్యాంకు లోన్ ద్వారా అందించబడుతుందన్నారు. బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఇంటి కరెంటు బిల్లు, ఇంటి పన్ను, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్





పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: స్వాతంత్ర్య సమరయోధుడిగా, దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, ఆంధ్రరాష్ట్ర శాసనసభ నేతగా, పార్లమెంట్ సభ్యునిగా పుచ్చలపల్లి సుందరయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుచ్చలపల్లి నిరాడంబర జీవితం సాగిస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. కార్మికులు, రైతుల కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆయన బాటలో సీపీఎం శ్రేణులు నిరంతరం పయనిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాలు నేతలు కె.వి.లక్ష్మణరావు, జె.ధర్మరాజు, అగస్టీన్, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకట్రావు, వై.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి వర్ధంతి

అమర్తలూరు(వేమూరు): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజలకు అనేక సేవలు అందించడం జరిగిందని సీపీఎం వేమూరు కార్యదర్శి బి.అగస్టీన్ అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని కూచిపూడి గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ కూలీల కోసం సంఘం ఏర్పాటుకు పుచ్చలపల్లి కృషి చేశారని అప్పటి నుంచి కూలీల సంఘాలు అనేక సమస్యలపై పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజు, చావలి రమేష్, కె.శ్యాంసన్, జి.మోజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర సబ్ రిజిస్టర్, సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న డాక్యుమెంట్ రైటర్స్ , ప్రజలు

కొల్లిపర: సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం డాక్యుమెంట్ రైటర్స్ ప్రజలు కలసి కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆదినారాయణ రెడ్డిని, ఆఫీస్ సిబ్బందిని శాలువాలతో పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆఫీసులలో కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఐఎస్‌వో గుర్తింపు రావడానికి కారణమైన సబ్ రిజిస్టర్ ఆది నారాయణరెడ్డి కృషి ఎనలేనిదని కొనియాడారు. కొల్లిపర ఆఫీసును మరింత అభివృద్ధి పథంలో ప్రజల భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకెళ్లాలని సీనియర్ డాక్యుమెంట్ రైటర్‌లు తమ్మా బసవ పున్నా రెడ్డి, బొందలపాటి గంగాధర్ తదితరులు కోరారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు కోటిరెడ్డి, సుభాని, రమణ శర్మ, బసవ పున్నారెడ్డి, మాధవరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, సుబ్బారావు, జానకిరామ్, వీరయ్య, సాంబిరెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (వేమూరు, రేపల్లె)
90109 62225 (పొన్నూరు, బాపట్ల)
Office mail : sakshigntadvt@gmail.com